సాక్షి కుమురం భీం

గురువారం । 27 । జూలై । 2023



జెడ్పీ చైర్‌పర్సన్ మొక్కులు

రెబ్బెన: పుంజుమేరగూడలోని భూవమ్మ తల్లి దేవస్థానాన్ని బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి సందర్శించారు. పీరీలకు మొక్కులు చెల్లించారు.



తడారని చేను..!

జిల్లావ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పంట చేలల్లో విపరీతంగా కలుపు పెరిగింది. పంట మొక్కలు చీడపీడల బారిన పడుతున్నాయి. 9లో ▸

గరిష్టం/కనిష్టం
29.8/25.3

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి అందుబాటులోకి టీ9 టికెట్లు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో టీ9 (30) ఆర్టీసీ బస్సు టికెట్లు గురువారం నుంచి అందుబాటులోకి రానున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు రూ.50లతో టీ9 టికెట్ తీసుకుని పల్లెవెలుగు బస్సుల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు 30 కిలోమీటర్ల పరిధిలో ప్రయాణించే అవకాశం ఉందన్నారు. ఈ టికెట్‌తో ప్రయాణికులకు రూ.10 నుంచి రూ.30 వరకు ఆదా అవుతుందన్నారు. అలాగే అదనంగా రూ.20 చెల్లిస్తే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రయాణించొచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేట్ ఇంటర్మీడియెట్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు గడువు పెంచినట్లు డీఐఈవో శ్రీధర్‌సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలల్లో ఫస్టియర్ ప్రవేశాలకు ఈ నెల 25తో గడువు ముగియగా ప్రభుత్వం ఈ నెల 31 వరకు పొడిగించిందని పేర్కొన్నారు. గడువు ముగిసిన తర్వాత అడ్మిషన్ తీసుకునే విద్యార్థులు ఆగస్టు 1 నుంచి 15 లోగా రూ.500 లేట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

విపత్కర పరిస్థితుల్లో సమాచారం ఇవ్వాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విపత్కర పరిస్థితుల్లో కంట్రోల్‌రూంకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సురేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత గృహాలు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఉండేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆపద సమయంలో కంట్రోల్ రూం సీఐ 87125 96665, డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు.

అడ ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తివేత

ఆసిఫాబాద్‌రూరల్: భారీ వర్షాలతో అడ (కుమురంభీం) ప్రాజెక్టు ఆరు గేట్లను బుధవారం ఎత్తారు. భారీగా వరద నీరు వస్తుండటంతో ఆరు గేట్ల ద్వారా 12,294 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 5.54 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, 11,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

'వట్టివాగు' రెండు గేట్లు..

ఎగువ ప్రాంతాల్లో వర్షం కురుస్తున్న నేపథ్యంలో వట్టివాగు ప్రాజెక్టు రెండు గేట్లు 0.5 మీటర్లు ఎత్తి 1,528 క్యూసెక్కుల నీటికి కిందికి వదులుతున్నారు. దిగువ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు జేఈ జానీ తెలిపారు. తిర్యాణి మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దిగువన ఉన్న పెద్ద వాగు పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ వేణు



కలెక్టర్ హేమంత్ బోర్కడేకు మొక్క అందిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బుధవారం వేణు బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్‌గా ఇక్కడ పనిచేస్తున్న రాజేశం బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా నీటి పారుదలశాఖ స్పెషల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దాసరి వేణు బదిలీపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత్ బోర్కడేను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించారు. రెవెన్యూ అంశాలతోపాటు ఇతర అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తానని తెలిపారు. వివిధ శాఖల అధికారులు పోచయ్య, లింగాల రాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

'దిందా' గోడు పట్టించుకునేవారేరి..?



లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద

చింతలమానెపల్లి: వర్షాకాలం వచ్చిందంటే చింతలమానెపల్లి మండలం దిందా గ్రామం నెలల పాటు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటుంది. గ్రామానికి వెళ్లే మార్గంలోని లోలెవల్ వంతెన పైనుంచి వరద ప్రవహిస్తుంది. అత్యవసర సమయాల్లో స్థానికులు ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్నారు. ఈ క్రమంలో పలువురు గ్రామస్తులు ప్రాణాలు వదిలారు. హైలెవల్ వంతెన కోసం గ్రామస్తులు పోరుబాట పట్టారు. కేంద్ర ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా అధికారులు నిర్లక్ష్యంతో ఇప్పటికీ అటవీశాఖ అనుమతులు మంజూరు కాలేదు. దీంతో స్థానికులు వంతెన నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు.

వరదొస్తే రాకపోకలు బంద్



ఉధృతంగా ప్రవహిస్తున్న చింతలపాటి వాగు

కౌటాల: భారీ వర్షాలు కురిస్తే కౌటాల మండలం తలోడి సమీపంలోని చింతలపాటి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. లోలెవల్ వంతెన పైనుంచి వరద ఉప్పొంగుతుంది. దీంతో కౌటాల– చింతలమానెపల్లి మండలాలకు రాకపోకలు నిలిచిపోతాయి. వాగు ఉప్పొంగడంతో సమీప కోయగూడ గ్రామస్తులకు కష్టాలు తప్పడం లేదు.

పిల్లర్ల దశలో గుండి వంతెన



వానొస్తే.. కష్టాలే!

- ఏళ్లుగా పూర్తికాని వంతెనలు
- నిధులు మంజూరైనా అసంపూర్తిగానే నిర్మాణాలు
- వర్షాకాలంలో లోలెవల్ వంతెనలతోనూ ప్రజలకు అవస్థలు
- తప్పనిసరి పరిస్థితుల్లో నాటుపడవల్లో ప్రమాదకరంగా ప్రయాణం

కౌటాల: దశాబ్దాలు గడుస్తున్నా జిల్లాలోని మారుమూల గ్రామాలను అనుసంధానించే వంతెన నిర్మాణలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ఏటా వర్షాకాలంలో పల్లె ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. భౌగోళికంగా భిన్నమైన కుమురంభీం జిల్లాలో వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. గూడేలు, తండాల నుంచి ప్రధాన పట్టణాలకు రావాలంటే సాహసం చేయాల్సిందే. వందలాది ఆవాసాలకు నేటికీ అసలు రహదారి సౌకర్యం లేదు. దారి ఉన్న గ్రామాలకు సైతం మార్గమధ్యలోని వాగులపై లోలెవల్, హైలెవల్ వంతెనలు లేక వర్షాకాలమంతా అష్టదిగ్బంధమే అవుతుంది. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని ఐదు ఏజెన్సీ మండలాలతోపాటు కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ వరకు అన్ని మండలాల ప్రజలు ఒకే రకమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతాల్లో చిన్నపాటి వాగులు మొదలుకుని ఎర్రవాగు, పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగ నదీ పరీవాహక ప్రాంతాల్లో వంతెనలు లేక ప్రజానీకం బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు.

అసంపూర్తిగా పనులు..

జిల్లాలో చిన్నాచితక కల్వర్టులు మొదలుకుని భారీ వంతెనల వరకు చాలావరకు అసంపూర్తిగానే ఉన్నాయి. పనులు వేగవంతం చేయాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. మహారాష్ట్రలో వర్షాలు పడినా పెన్‌గంగ, ప్రాణహిత నదులు ఉగ్రరూపం దాల్చి గ్రామాలను ముంచెత్తుతున్నాయి. వానొస్తే గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. అత్యవసరమైనా.. నిత్యావసరమైనా ఊరు దాటి వెళ్లాలంటే ప్రాణాలకు తెగించాల్సి వస్తోంది.

మండలాల వారీగా పరిస్థితి..

- చింతలమానెపల్లి మండలం గంగాపూర్ సమీపంలోని ఒర్రెపై లోలెవల్ వంతెన ఉన్నా వరద నీటితో ఒర్రెను దాటనివ్వదు. గంగాపూర్, అంబగట్టు, కోర్సిని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. రణవెల్లి వద్ద వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోతాయి.
- గతేడాది ఆగస్టులో కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగు వంతెన కూలిపోయింది. తాత్కలిక వంతెన ఏర్పాటు చేసినా ఇటీవల వర్షాలకు అదీ కొట్టుకుపోయింది. కాగజ్‌నగర్, దహెగాంతోపాటు మంచిర్యాల జిల్లాలోని భీమిని మండలాలకు చెందిన 54 గ్రామాల ప్రజలకు నాటు పడవలపై ప్రయాణం తప్పడం లేదు.
- పెంచికల్‌పేట్– ఎర్రగుట్ట గ్రామాల మధ్య ఉచ్చమల్ల వాగుపై వంతెన నిర్మించకపోవడంతో అత్యవసర సమయంలో ఎర్రగుట్ట ప్రజల బాధలు వర్ణనాతీతం. పెంచికల్‌పేట్– దహెగాం మండలాల మధ్య పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన అప్రోచ్‌రోడ్డు పూర్తికాలేదు.
- బెజ్జూర్ మండలం సులుగుపల్లి వద్ద తీగల ఒర్రె, లింగాపూర్ మండలం పిట్టగూడ గ్రామాల సమీపంలోని వంతెన పైనుంచి వరద వెళ్తుండటంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. జైనూర్ మండలం లెండిగూడలో లోలెవల్ వంతెన పైనుంచి వరద ప్రవహించి రాకపోకలు ఆగిపోతున్నాయి.
- కెరమెరి మండలంలో పెండింగ్‌లో ఉన్న అనార్‌పల్లి, లక్మాపూర్ వంతెనల నిర్మాణ పనులను చేపట్టాలని గత ఫిబ్రవరిలో పది గ్రామాల ప్రజలు ఆందోళనలు నిర్వహించారు.

ఆస్పత్రికి కూడా వెళ్లలేం..



వానొచ్చిందంటే మా గ్రామానికి ఎప్పుడు రాకపోకలు నిలిచిపోతాయో చెప్పలేని దీన పరిస్థితి. వరదతో నెలల తరబడి లోలెవల్ వంతెన పైనుంచి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి కూడా వెళ్లలేం. వాగు దాటుతూ పలువురు మృతి చెందినా పాలకులు మాపై కరుణ చూపడం లేదు. వంతెన నిర్మాణం కోసం ఆందోళనలు సైతం నిర్వహించాం. మా కష్టాలు ఎవరికీ రావొద్దు.

– డి.రామన్న, దిందా, మం.చింతలమానెపల్లి

రెండేళ్లుగా నిర్మాణ దశలోనే..



అసంపూర్తిగా అమీన్‌గూడ వంతెన

తిర్యాణి: తిర్యాణి మండలం అమీన్‌గూడ గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై రెండేళ్ల క్రితం రూ.2కోట్ల అంచనా వ్యయంతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. వివిధ కారణాలతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో వంతెన ఇప్పటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. అమీన్‌గూడ, కోయతలండి, గోయోగాం గ్రామాల ప్రజలు ప్రమాదకరంగా వాగు దాటుతున్నారు.

'గుండి' గోస తీరేదెప్పుడు..?



నాటు పడవపై ప్రయాణిస్తున్న ప్రజలు

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగుపై వంతెన నిర్మాణానికి 2006లో శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభించారు. 17 సంవత్సరాలు గడిచినా నేటికీ వంతెన పిల్లర్ల దశ దాటలేదు. గ్రామస్తులు శీతాకాలం వరకూ వరద ఉన్నప్పుడు నాటుపడవలు, తెప్పల ద్వారా ప్రమాదకరంగా ప్రవాహం దాటుతున్నారు. ఇక వర్షాకాలం ముందుగానే రెండునెలలకు సరిపడా సరుకులు తెచ్చిపెట్టుకుంటారు. జిల్లా కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి వరద పెరిగిన సమయంలో 20 కి.మీ.లు తిరిగి రావాల్సిన దుస్థితి.

నిధులు మంజూరై.. నాలుగు నెలలు



ఉధృతంగా ప్రవహిస్తున్న ఖమాన ఒర్రె

వాంకిడి: వాంకిడి మండలం ఖమాన ఒర్రెపై దశాబ్దాల క్రితం రెండు సిమెంట్ పైపులు వేసి లోలెవల్ వంతెన నిర్మించారు. చిన్నపాటి వర్షాలకు కూడా ఒర్రె ఉప్పొంగి లెవెల్ వంతెన పైనుంచి ప్రవహించడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. ప్రవాహం తగ్గే వరకు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.4కోట్లు మంజూరు చేసింది. సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నిధులు మంజూరై నాలుగు నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

ప్రభుత్వ వైఫల్యంతో అసంపూర్తిగా 'డబుల్' ఇళ్లు

- టీపీసీసీ అధికార ప్రతినిధి బాలకృష్ణ
- జిల్లాలో డబుల్ బెడ్రూం ఇళ్లు పరిశీలన

ఆసిఫాబాద్‌అర్బన్: బీఆర్ఎస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతుందని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే జిల్లాలో డబుల్ బెడ్రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి మాడ్యం బాలకృష్ణ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు, వాటి స్థితిగతులను బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. బాలకృష్ణ మాట్లాడుతూ ఆసిఫాబాద్‌లో కేవలం 26 ఇళ్లను ప్రారంభించగా ప్రస్తుతం అవి పునాది దశను కూడా దాటలేదన్నారు. కాగజ్‌నగర్, సిర్పూర్(యూ), జైనూర్ తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కోరిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల చొప్పున మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.



కాగజ్‌నగర్‌లో ఇళ్లు పరిశీలిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లు అసంపూర్తిగా మిగిలిపోయాయని టీపీసీసీ అధికారి ప్రతినిధి బాలకృష్ణ అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్లను బుధవారం పరిశీలించారు. 288 డబుల్ బెడ్రూం గృహాలు నిర్మించాల్సి ఉండగా కేవలం 8 మాత్రమే పూర్తిగా నిర్మించారని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు సరస్వతి, కృష్ణారెడ్డి, గణేశ్‌రాథోడ్, రావి శ్రీనివాస్, దస్తగిరి, వెంకటేశ్, చరణ్, మురళి, కళావతి షబ్బీర్ తదితరులు ఉన్నారు.

చదవడం, రాయడం రావాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని తొలిమెట్టు కార్యక్రమం శిక్షణ రాష్ట్ర పరిశీలకుడు సువర్ణ వినాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న రెండో విడత తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో సూక్ష్మసామర్థ్యాలు వస్తేనే విద్యార్థులు అభ్యసన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, రూం టూ రీడ్ రాష్ట్ర మేనేజర్ చారి, క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, శిక్షణ రిసోర్స్‌పర్సన్ రాజకమలాకర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

రైతులకు తోడ్పాటునందించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన తోడ్పాటునందించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం టాటా ట్రస్ట్ తెలంగాణ రీజినల్ మేనేజర్ భగీరథ గోపీ, సుస్మిత, చిరోరే కలెక్టర్‌ను కలిశారు. ఆసిఫాబాద్, వాంకిడి, కౌటాల మండలాల్లో రైతుల పరిస్థితులపై అధ్యయనం చేసి, పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంతోపాటు పాడి, మత్స్య పరిశ్రమ రంగాల్లో రైతులు ఆర్థికంగా బలపడేందుకు టాటా ట్రస్ట్ ప్రతినిధులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు వాసు, పద్మాకర్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

వ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలు

- డీఎంహెచ్‌వో రామకృష్ణ

దహెగాం(సిర్పూర్): గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని డీఎంహెచ్‌వో రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇళ్ల ఆవరణలో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే గర్భిణులను ప్రసవం కోసం ముందుగానే స్థానికంగా ఉండే పీహెచ్‌సీకి తరలిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో రవాణా సౌకర్యం లేని 138 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని తెలిపారు. వైద్యం సాయం కోసం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్‌రూం 89194 48156 నంబరులో సంప్రదించాలని సూచించారు. డీపీవో ధరమ్‌సింగ్, మాస్ మీడియా ఇన్‌చార్జి రషీద్, వైద్యాధికారి స్పందన, సిబ్బంది ఉన్నారు.



బాలింతతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

అరాచక పాలనను అంతం చేస్తాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కౌటాలలో పార్టీ కార్యకర్తల సమావేశం

కౌటాల(సిర్పూర్): సిర్పూర్ నియోజకవర్గంలో అరాచక పాలనను అంతం చేస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జగదాంబ గార్డెన్‌లో పార్టీ కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న కోనేరు కోనప్ప గ్రామీణ ప్రాంతాలకు కనీసం రోడ్లు, వంతెనలు నిర్మించలేదని విమర్శించారు. దిందా వాగుపై హైలెవల్ వంతెన లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయరని పేర్కొన్నారు. వాగు దాటలేకపోతున్నామని బాధను వినిపించిన ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయించడం ఎమ్మెల్యే చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యేకు కలెక్టర్ వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇటీవల చింతలమానెపల్లి కేజీబీవీలో విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి వెళ్తే.. అక్కడి ఎస్‌వో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డీఈవోకు ఫిర్యాదు చేయడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. గతంలో పాలించిన పాల్వాయి కుటుంబం సైతం ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. అనంతరం నియోజకవర్గ సమస్యలపై కరపత్రం ఆవిష్కరించారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పలువురు బీఎస్పీలో చేరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిడాం గణపతి, అర్షద్ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు గణపతి, మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు చిన్నయ్య, రాంప్రసాద్, నవీన్, గణపతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు

సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సివిల్ సప్లై హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్టుపల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో బుధవారం సివిల్ సప్లై వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో 30 ఏళ్లుగా హమాలీ కార్మికులు కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పిడుగు శంకర్, ఉపేందర్, శ్రీనివాస్, సుధాకర్, దత్తు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్

నిండుకుండలా పీపీరావు ప్రాజెక్టు

భారీ వర్షాలతో దహెగాం మండలం కల్వాడ సమీపంలోని పీపీరావు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండటంతో బుధవారం ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం దాటి మత్తడి పైనుంచి అలుగు పారుతోంది. ప్రాజెక్టు నీటితో స్థానిక ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

– దహెగాం



క్లుప్తంగా

ట్రాలీ ఎక్కిన పడవ



ట్రాలీలో తీసుకెళ్తున్న పడవ

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ నుండి సోమనపల్లి వైపునకు బుధవారం జాలర్లు ఆటో ట్రాలీలో పడవను తీసుకెళ్తున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన వారంతా 'ట్రాలీ ఎక్కిన పడవ' అని, నీటిలో వెళ్లాల్సిన పడవ ఆటో ట్రాలీలో వెళ్తోందని చర్చించుకున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

తాండూర్(బెల్లంపల్లి): మండల పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన గందంవేణి కృష్ణంరాజు (39) పట్టణ శివారులోని గద్దె రాగడి ప్రాంతంలో హమాలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్న కృష్ణంరాజు రెండురోజుల క్రితం తాండూర్ మండలం రాజీవ్ నగర్‌లో ఉన్న అత్తగారింటికి వచ్చాడు. బుధవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

'ఎస్సార్పీ-1 గనిలో మిస్‌ఫైర్ కాలేదు'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ-1 గనిలో మిస్‌ఫైర్ ప్రమాదం జరుగలేదని డీజీఎం (పర్సనల్) అరవింద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గనిలో మంగళవారం జరిగిన ప్రమాదం ఘటనపై జీఎం బీ.సంజీవరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు విచారణ జరిపించారు. గనిలోని 3బీ సీమ్, 81/2 లెవల్లో ఎస్డీఎల్ యంత్రం వెళ్లడానికి దారి చేయడంలో భాగంగా బాటమ్ బ్లాస్టింగ్ కోసం కోల్‌కట్టర్ కార్మికులు ఉల్లు కొస్తున్నారని ఈ క్రమంలో ఒక్కసారిగా దుమ్మురావడంతో అదే సమయంలో అక్కడ ఉన్న కోల్‌కట్టర్ కార్మికుడు నోముల సత్తయ్య కళ్లలో పడిందన్నారు. మిస్‌ఫైర్ జరిగిందనే ప్రచారం అసత్యమన్నారు.

పిడుగుపాటుకు కాడెద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

భీమిని: మండలంలోని పెద్దగుడిపేటలో బుధవారం పిడుగుపాటుకు కాడెద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన మానెపల్లి శంకరయ్య ఎద్దు గ్రామ సమీపంలోకి మేతకు వెళ్లింది. మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షానికి ఎద్దుపై పిడుగు పడటంతో మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

దుకాణంలో చోరీ

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఏటూజెడ్ బజార్ దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు దుకాణం వెనుక తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బుధవారం ఉదయం యజమాని వచ్చి చూసేసరికి దుకాణంలో వస్తువులు చిందర వందరగా పడేసి ఉన్నాయి. కౌంటర్ తాళం పగులగొట్టి అందులో ఉన్న రూ.15 వేలు అపహరించినట్లు దుకాణం యజమాని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

పండ్లతోటలకు 'ఉపాధి' నిధులు

- చిన్న, సన్నకారు రైతులకు అవకాశం
- సబ్సిడీపై బిందుసేద్య పరికరాలు
- మూడేళ్ల వరకు ప్రభుత్వ ఖర్చులతో నిర్వహణ
- దరఖాస్తులకు ఈ నెల 31 తుదిగడువు



మామిడితోట (ఫైల్)

పాతమంచిర్యాల: ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న చిన్న సన్నకారు రైతులకు ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి ఉండి నీటివసతి కలిగిన రైతులకు పండ్లతోటలు పెంచడానికి రాయితీలు ఇస్తూ సాగుకు ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, ఉద్యానవనశాఖ సంయుక్తంగా పండ్లతోటల పెంపకంపై ఆసక్తి కలిగిన రైతుల ఎంపిక చేపట్టింది. ఆసక్తి కలిగిన రైతులు వ్యవసాయ భూముల్లో గట్లపై పండ్ల మొక్కలు నాటడానికి అవకాశం కల్పించింది. రైతులు అల్లనేరేడు, కొబ్బరి, వంకాయ, సీతాఫలం వంటి మొక్కలు గట్లపై నాటుకోవచ్చు. బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా ఎకరా విస్తీర్ణంలో మామిడి, నిమ్మ, సంత్రా, జామ, సీతాఫలం, సపోట, ఆయిల్‌పాం, జామ, అల్లనేరేడు, ఆపిల్‌బేర్, జీడిపప్పు, దానిమ్మ, మునగ, డ్రాగన్‌ఫ్రూట్, తదితర రకాల పండ్లమొక్కలు ఉన్నాయి.

1,467 ఎకరాల్లో పెంచాలని లక్ష్యం

జిల్లాలో 1,467 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం చేపట్టాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఒక ఎకరా విస్తీర్ణంలో మామిడి మొక్కలు రకాన్ని బట్టి 81 లేదా 110 లేదా 160 చొప్పున నాటుకోవచ్చు. నిమ్మమొక్కలు 110, ఆయిల్ పాం మొక్కలు 57, మునగ మొక్కలు 1000 చొప్పున నాటుకోవాలి. అలాగే డ్రాగన్‌ఫ్రూట్ అర ఎకరానికి 900 మొక్కలు నాటాల్సి ఉంటుంది. భూమి సౌలభ్యతను బట్టి ఎకరా విస్తీర్ణం లేదా అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు అధికారులు నిర్ణయించిన కొలతల ప్రకారం మొక్కలు నాటుకోవాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొన్నారు. మొక్కల పెంపకానికి ఉద్యానవన శాఖ నుంచి రైతులకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీ వర్తిస్తుంది.

జాబ్‌కార్డు తప్పనిసరి

ఐదెకరాల సొంతభూమి ఉండి నీటివసతి కలిగిన రైతులు ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన నర్సరీల నుంచి మాత్రమే పండ్ల మొక్కలు కొనుగోలు చేయాలి. గుంతలు తీయడం, మొక్కలు నాటే పనులను ఉపాధి హామీ కూలీల ద్వారానే చేపడుతారు. మొక్కలకు ఊత కర్రల కొనుగోలు, ఎరువుల కొనుగోలు, తదితరాలకు ఉపాధి హామీ పథకం నుంచి రైతులకు నిధులు సమకూరుస్తారు. మొక్కలు నాటినప్పటి నుంచి మూడేళ్ల వరకు తోటల నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుంది. ఆపిల్‌బేర్, దానిమ్మతోటలకు రెండేళ్ల వరకు మునగ తోటలకు ఏడాది వరకు తోటల నిర్వహణ ఖర్చులు అందజేస్తారు. ఆసక్తి కలిగిన రైతులు జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు, గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉపాధి హామీ పథకం ఏపీవోలను సంప్రదించి ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



2007 నుంచే ఉపాధిహామీ పథకంలో పండ్ల తోటల సాగుకు మొక్కలు ఉచితంగా ఇస్తున్నారు. ఈ ఏడాది డ్రిప్ పరికరాలపై ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. మొక్కలు నాటినప్పటి నుంచి మూడేళ్లపాటు పండ్ల తోటల నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుంది. ఆసక్తి కలిగిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. – బి.శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, మంచిర్యాల

వర్షంలో సైకిల్‌పై గస్తీ తిరిగిన సీఐ



సైకిల్‌పై తిరుగుతున్న సీఐ

మందమర్రిరూరల్: మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి వర్షంలో సైతం పట్టణంలో సైకిల్‌పై గస్తీ తిరుగుతున్నారు. బుధవారం ఉదయం సైకిల్‌పై పలుకాలనీల్లో తిరుగుతూ బయట తిరుతున్న చిన్నారులను దగ్గరకు తీసుకుని వర్షంలో బయటకి రావొద్దని సూచించారు. ప్రతిరోజు సైకిల్‌పై తిరగడం వలన వ్యాయామంతో పాటు గస్తీ కూడా అవుతుందని సీఐ తెలిపారు.

ఈఎస్ఐ ఆస్పత్రి ల్యాబ్‌లో షార్ట్‌సర్క్యూట్

- రూ.10 లక్షల ఆస్తి నష్టం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి ల్యాబ్‌లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో ల్యాబ్‌లోని పరికరాలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. విధుల్లో ఉన్న సిబ్బంది మధ్యాహ్న భోజనం కోసం ల్యాబ్‌కు తాళం వేసి వెళ్లారు. 3 గంటల ప్రాంతంలో ల్యాబ్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందివ్వడంతో మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.10 లక్షలకు పైగానే నష్టం జరిగినట్లు సిబ్బంది వివరించారు.

కార్మిక కాలనీల్లో మురుగునీరు సరఫరా



సరఫరా అయిన నీరు

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణిలోని మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్‌లోని కార్మిక కాలనీల్లో కొద్దిరోజులుగా మురుగునీరు సరఫరా అవుతోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీరు కలుషితమైంది. అదే రంగుమారిన నీటినే సింగరేణి యాజమాన్యం యథాతథంగా కాలనీలకు సరఫరా చేస్తోంది. దీంతో గత్యంతరంలేక అదేనీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నామని కార్మిక కుటుంబాలు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య మాట్లాడుతూ కలుషిత నీటి సరఫరాపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్మిక కుటుంబాలు, పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలు కాకముందే ఫిల్టర్ చేసిన నీరు అందించాలని డిమాండ్ చేశారు.

గోలేటి సీహెచ్‌పీని ఉన్నతస్థాయికి చేర్చాలి



మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ సిస్టం ప్రారంభిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి సీహెచ్‌పీని మరింత ఉన్నత స్థాయికి చేర్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు అన్నారు. బుధవారం ఆయన గోలేటి సీహెచ్‌పీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్లాంటు మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ సిస్టం, 3.3 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాకు త్వరలోనే పూర్వ వైభవం రానుందన్నారు. సీహెచ్‌పీ ద్వారా వినియోగదారులకు సకాలంలో బొగ్గును అందించాలన్నారు. నిర్ణీత సమయానికి నాణ్యమైన బొగ్గును సరఫరా చేసి సింగరేణికి పేరు తీసుకురావాలన్నారు. గోలేటి సీహెచ్‌పీని ఉత్తమ సీహెచ్‌పీగా నిలిపిన అధికారులు, ఉద్యోగులను అభినందించారు. అనంతరం సీహెచ్‌పీ ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో జీఎం స్వామి నాయుడు, ఏరియా జీఎం దేవేందర్, ఎస్‌వోటూ జీఎం నరేందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్లరాజు శ్రీనివాస్‌రావు, పీవో సత్యనారాయణ, డీజీఎం భీంరావ్ జాడే, బీపీఏ ఓసీపీ పీవో ఉమాకాంత్, డీజీఎం సతీష్‌బాబు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, పిట్ కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

జరిమానా చెల్లింపు



తహసీల్దార్‌కు చలానా ఇస్తున్న అధికారులు

దండేపల్లి(మంచిర్యాల): మండల కేంద్రానికి చెందిన అక్కనపెల్లి శ్రీనివాస్ బైండోవర్ ఉల్లంఘించినందుకుగానూ అతనికి విధించిన రూ.లక్ష జరిమానాను బుధవారం చెల్లించినట్లు లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ బాబా తెలిపారు. శ్రీనివాస్ గతంలో నాటుసారా తయారీకి ఉపయోగించే పటిక, బెల్లం విక్రయిస్తూ పట్టుబడ్డాడు. దీంతో అతను మళ్లీ నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు గతేడాది దండేపల్లి తహశీల్దార్ హన్మంతరావు ఎదుట బైండోవర్ చేశారు. అయినా మళ్లీ పటిక, బెల్లం విక్రయించడంతో ఈ నెల 18న తహశీల్దార్ ఎదుట హాజరు పర్చడంతో రూ.లక్ష జరిమానా విధించారు. బుధవారం జరిమానా చెల్లించి చలానాను తహసీల్దార్‌కు అందించాడు. కార్యక్రమంలో ఎస్సై రాబర్టు పాల్గొన్నాడు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌రావు

భీమారం(చెన్నూర్): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఉపాధ్యాయులతో కలిసి తహసీల్దార్ వాసంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు వెంటనే జరపాలని, పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలని, 317 జీవో ద్వారా స్థానికతని కోల్పోయిన వారికి సొంతజిల్లాలో అవకాశం కల్పించాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందికంటి శ్రీనివాస్‌రావు, గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలు, రాస్తారోకోలకు అనుమతి తప్పనిసరి

బెల్లంపల్లి: ప్రజాస్వామ్యయుతంగా ధర్నాలు, రాస్తారోకోలు ఇతర నిరసన కార్యక్రమాలు నిర్వహించే రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు ముందస్తుగా పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఏసీపీ పంతాటి సదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు సందర్భాల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనుమతి నిరాకరించిన పక్షంలో ఆందోళన కార్యక్రమం వాయిదా వేసుకోవాలన్నారు. ఇష్టారీతిన నిరసన కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతికోసం దరఖాస్తు చేసిన నాయకులు తప్పనిసరిగా నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పద్మశాలీలు ఏకం కావాలి

పాతమంచిర్యాల: పద్మశాలీయులంతా ఏకతాటిపైకి రావాలని తెలంగాణ పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చిలగాని సుదర్శన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా 101 మందితో జిల్లా జంబుదారిని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పద్మశాలీ భవన నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 13న కోరుట్లలో పద్మశాలీ కుల బాంధవులతో నిర్వహించే పద్మశాలీ యుద్ధభేరిని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆవిడపు వెంకటేశ్వర్లు, కోశాధికారిగా వెన్నం లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా అంజయ్య, ప్రచార కార్యదర్శిగా ఓంప్రకాష్, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బాపూజీలను ఎన్నుకున్నారు.

గర్భిణికి దారి కష్టాలు

- గిరిజనులకు తప్పని ఎడ్లబండి తిప్పలు



గర్భిణిని బండిలో ఎక్కిస్తున్న కుటుంబ సభ్యులు



పాటి గ్రామానికి చెందిన గర్భిణిని ఎడ్లబండిలో తరలిస్తున్న గిరిజనులు

నెన్నెల(బెల్లంపల్లి): రోడ్డు సదుపాయానికి నోచుకోని గిరిజన గ్రామం అది. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లాలంటే కాలినడకన లేదా ఎడ్లబండే గతి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగులు, వంకలు దాటాల్సిందే. 108 అంబులెన్స్ రాక, వైద్య సౌకర్యం అందక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నెన్నెల మండలం కోనంపేట పంచాయతీ పరిధిలోని పాటి గ్రామానికి చెందిన గిరిజన మహిళ రెడ్డి మల్లక్క మూడు నెలల గర్భిణి. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో దారిలేక ఆస్పత్రికి వెళ్లలేకపోయింది. బుధవారం తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఎడ్లబండిపై లంబాడితండా ఎర్రవాగు వరకు తీసుకువచ్చారు. అక్కడ ఆటోలో ఎక్కించి అందరూ కలిసి అతికష్టం మీద వాగు దాటించి బెల్లంపల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గతంలో దమ్మిరెడ్డిపేటకు చెందిన గిరిజనుడు జ్వరంతో బాధపడుతూ వాగు దాటలేక మృతి చెందాడు. ఎన్నికల ముందు సర్పంచ్ హామీ ఇచ్చినప్పటికీ రోడ్డు సౌకర్యం కల్పించలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే పాటి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకొని గిరిజనులు బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా నేతలు మారినా అధికారులు వచ్చి చూసినా దారిచూపే నేతలు లేక మా రాతలు మారడం లేదని గిరిజనులు గోడు వెల్లబోసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించి ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు.

పొన్నారంలో కూలిన పెంకుటిల్లు



కూలిపోయిన ఇల్లు

మందమర్రిరూరల్(చెన్నూర్): ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పొన్నారంలో వేల్పుల లక్ష్మికి చెందిన పెంకుటిల్లు బుధవారం నేలమట్టమైంది. లక్ష్మి భర్త కొంతకాలం క్రితం మృతి చెందగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అధికారులు స్పందించి సాయం అందించాలని కోరుతోంది. ఎవరైనా దాతలు తోచినంత సాయం చేస్తే ఇల్లు నిర్మించుకుంటానని వేడుకుంటోంది.

86 మందికి క్వార్టర్ల కేటాయింపు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కింద 86 మందికి క్వార్టర్లు కేటాయించారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 300 మంది హాజరు కాగా 86 మంది క్వార్టర్లు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఒకరు అదృశ్యం



వైకుంఠం

బెల్లంపల్లి: మండలంలోని బుధాకుర్దు గ్రామానికి చెందిన చీకటి వైకుంఠం అదృశ్యమైనట్లు తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపారు. ఈ నెల 22న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వైకుంఠం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా సమాచారం లభించలేదు. మానసికంగా బలహీనంగా ఉన్న వైకుంఠం ఇంతకుముందు కూడా ఇలాగే ఇంట్లోనుంచి వెళ్లి 2, 3 రోజుల తర్వాత తిరిగి వచ్చాడు. కానీ ఈసారి ఇంత వరకూ జాడ తెలియక పోవడంతో అతని తమ్ముడు చీకటి రమేశ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్



నివాళులు అర్పిస్తున్న మాజీ సైనికులు, యువకులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం, యువతరం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్గిల్ విజయ్ దివాస్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి వెంకటేశ్వర్ టాకీస్ చౌరస్తా వరకు 75 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ బీ.తిరుపతి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అక్కల కిరణ్‌కుమార్, సలహాదారు సభాష్‌చంద్రబోస్, యువతరం సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిరుపతి, ఉపాధ్యక్షులు కే.శ్రీపాద్, మేక సురేందర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా డిమాండ్‌చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్యశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతిభ, వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. పీఆర్సీ ఏర్పాటు చేయాలని, ఐఆర్ 40 శాతం ఇవ్వాలని, బకాయి ఉన్న మూడు డీఏలు తక్షణమే మంజూరు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ తులసిదేవి, ఏవోలు ఈశ్వరయ్య, శ్రీనివాస్, కార్యాలయ పర్యవేక్షకులు అన్నపూర్ణ, నాగేశ్వర్‌రావు, నర్సయ్య, శంకర్, అనిల్ నాగయ్య, ఎండి.ఖాజా నియాజొద్దీన్, మహేశ్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలి

బెల్లంపల్లి: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి టీ.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి సివిక్ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల నుంచి యాజమాన్యం సీఎంపీఎఫ్ రికవరీ చేస్తున్నా అందుకు సంబంధించిన ప్రూఫ్స్ ఇవ్వడం లేదన్నారు. ఏడాదికోసారి సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటి, కొమురయ్య, లింగయ్య, శ్రీనివాస్, బాను, కృష్ణవేణి, లత, బుచ్చమ్మ, దేవక్క, మైసక్క తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని శుద్ధి చేయాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మిక కాలనీలకు కంపెనీ శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారావు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా కాలనీలకు పంపిణీ చేస్తున్న తాగినీరు కలుషితంగా వస్తుందన్నారు.

పిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్ ఏఐటీయూసీ నూతన పిట్ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. వర్క్‌షాప్ వద్ద జరిగిన సమావేశంలో ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్ కే బాజీసైదా, కే.వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య బ్రాంచి కార్యదర్శి కొట్టే కిషన్‌రావు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పిట్ సెక్రటరీగా సదానందం, ఉపాధ్యక్షులుగా మల్యాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దామోదర్, జాయింట్ సెక్రటరీగా పరిపూర్ణాచారి, కోశాధికారిగా రాములు, ప్రచార కార్యదర్శులుగా మల్లారెడ్డి, శ్రీకాంత్, మోజేష్, బండారి రాజన్న, చింతల రవి, కౌన్సిల్ సభ్యులుగా ప్రభాకర్, రాజేశ్, సూర్యం, వేణు, వెంకయ్య, జలీల్, సద్దాం హుస్సేన్, రవీందర్, రాజేశ్, బాబు ఎన్నికయ్యారు.

సింగరేణిలో ప్రమాదాలు నివారించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రమాదాలను పూర్తిగా నివారించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా తెలిపారు. ఆర్కే 7గనిపై బుధవారం నా భద్రత–నా బాధ్యత, నా భద్రతే–నా కుటుంబ భద్రత అనే నినాదంపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ ఆర్కే 7గనిని ప్రమాద రహిత గనిగా సింగరేణిలో గుర్తింపు తేవాలన్నారు. అనంతరం ఉద్యోగులతో రక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి శ్రీధర్‌రావు, ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.